# శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 06 | సంచిక : 16 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | మంగళవారం 15-09-2026 | పేజీలు : 2




# హమ్మయ్య..!

**సకాలంలో వర్షం..!**
**కరుణించిన వరుణదేవుడు..!**
**అన్నదాతకు ఊరట..!**

# బతికిపోయాం..!

## మొన్నటి వరకు వాడిన మొక్కజొన్న..!

## దెబ్బతిన్న పత్తి చేనులు..!

### కరెంట్ కోతలతో ఎండిన వరి..!

### రెండు రోజుల పాటు సమృద్ధిగా వానలు..!

### మెట్ట పంటలకు జీవగంజి..!



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** హమ్మయ్య..! బతికిపోయాం..! రోజుల తరబడి వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతకు ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. సకాలంలో కురిసిన వర్షాలతో ఎండిపోతున్న పంటలకు ప్రాణం వచ్చింది. మొన్నటి వరకు వర్షాల జాడ లేక మొక్కజొన్న పంటలు వాడిపోతుండగా.. పత్తి చేనుల్లోనూ మొక్కలు నీటి ఎద్దడితో ఎదుగుదల కోల్పోయాయి. మరోవైపు కరెంట్ కోతలు రైతులను మరింత ఇబ్బందులకు గురిచేశాయి. బోర్లు, బావుల నుంచి నీటిని పంటలకు అందించేందుకు విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో వరి పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల ఇప్పటికే వరి పైరు ఎండిపోయి రైతులు ఆందోళన చెందారు. ఈ తరుణంలో గత రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఒక్కసారిగా ఆశలు చిగురించాయి. ముఖ్యంగా వర్షాధారంగా సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, కంది తదితర మెట్ట పంటలకు ఈ వర్షాలు ఎంతో మేలు చేశాయి. పొలాల్లో తేమ పెరగడంతో వాడిపోతున్న మొక్కలు తిరిగి పుంజుకునే పరిస్థితి ఏర్పడింది. వరి పొలాల్లోనూ నీటి లభ్యత పెరగడంతో రైతులకు కొంత ఊరట లభించింది. వర్షం కోసం ఎదురుచూస్తున్న సమయంలో కురిసిన ఈ వానలు పంటల ఎదుగుదలకు కీలకంగా మారడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **తరువాయి 2లో...**



# కొలువుదీరిన గణపయ్య

## వాడవాడలా ప్రత్యేక పూజలు

- రాష్ట్ర వ్యాప్తంగా కోలాహలం
- ఖైరతాబాద్ గణేష్ వద్ద భక్తుల రద్దీ
- అన్ని ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులు
- కొన్ని మండపాల వద్ద డీజేల మోత..!
- మితిమీరుతున్న సౌండ్..!
- హద్దులు దాటుతున్న ఆనందం..!
- భక్తి ముసుగులో శబ్ద కాలుష్యం!
- గుండె బాధితులకు పెను ముప్పు
- భయపడుతున్న చిన్నారులు
- ఇటీవల డీజేకు బలైన యువకుడు..!
- తోపులాట, తొక్కిసలాటలో మృతి
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- హెచ్చరిస్తున్న పోలీస్ అధికారులు

**శనార్తి తెలంగాణ హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎంతో కోలాహలంగా, వైభవంగా ప్రారంభమయ్యాయి. వీధివీధినా గణనాథులు కొలువుదీరడంతో నగరాలు, **తరువాయి 2లో...**



## బంగ్లాను వణికిస్తున్న తట్టు

- 1.71 లక్షల మందికి తట్టు లక్షణాలు
- 1.51 లక్షల మంది ఆసుపత్రుల్లో చేరిక
- ఇప్పటికే 1,022 మంది మృతి
- బంగ్లా పరిస్థితులపై డబ్ల్యూహెచ్ఓ ఆందోళన


2

# టీఆర్పీలో భారీ చేరికలు

## బిఆర్ఎస్ పార్టీని వీడిన యువత

- జనగాం నుండి పెద్ద ఎత్తున జాయినింగ్స్
- కండువా కప్పి ఆహ్వానించిన పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- మైనార్టీ విభాగం అధ్యక్షుడు సల్మాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- పలువురికి నియామక పత్రాల అందజేత
- పెద్దపల్లి 8వ వార్డు మెంబర్ కార్తీక్ ఆధ్వర్యంలోనూ చేరికలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

2





## మూసీకి వరద ఉధృతి

- నిండు కుండలా రిజర్వాయర్
- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు
- క్రమంగా పెరుగుతున్న నీటి నిల్వ
- పూర్తి స్థాయి నీటిమట్టం 645 అడుగులు
- ప్రస్తుత నీటిమట్టం 638 అడుగులు
- గేట్లు ఎత్తే ఆలోచనలో అధికారులు
- పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

2

## శాలియన్ మృతి కేసులో కీలక పరిణామం

2



- ఆదిత్య ఠాక్రే, రియాపై ఎఫ్ఐఆర్
- బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ కేసు నమోదు
- 2020 జూన్ 8న మృతి చెందిన శాలియన్
- ఆమెపై సామూహిక అత్యాచారం జరిగినట్లు అప్పట్లో కేసు నమోదు
- ఇటీవలే కేసును సీబీఐకి బదిలీ చేసిన బాంబే ఉన్నత న్యాయస్థానం
- హైకోర్టు ఆదేశాల మేరకు ఆదిత్యపై కేసు

## మునిగిపోయిన నౌక..!

- ఇండోనేషియాలో ఘోర ప్రమాదం..!
- నౌకలో 243 మంది ప్రయాణికులు
- ఆరుగురి మృతి.. 130 మంది గల్లంతు
- 107 మందిని కాపాడిన భద్రతా సిబ్బంది
- కొనసాగుతున్న గాలింపు చర్యలు

2




## అంబర్‌పేట శంకర్‌కు షాక్

- మళ్లీ రౌడీషీట్ ఓపెన్
- అంబర్‌పేట పోలీసుల కీలక నిర్ణయం
- జూబ్లీహిల్స్, మేడిపల్లి పీఎస్ లిమిట్స్‌లో శంకర్‌పై బెదిరింపు ఆరోపణలు
- 2019లో రౌడీషీట్ క్లోజ్
- ఇటీవల నమోదైన రెండు కేసులతో మళ్లీ రౌడీషీట్ రీ ఓపెన్

2






## బీసీ సోదరా.. కదలిరా
### రాజ్యాధికార యాత్రకు అడుగేయి

తరతరాల అణచివేత సంకెళ్లు తెంచుకుంటూ, శ్రమజీవుల గుండెల్లో చైతన్యపు నిప్పు కణమై, గోల్కొండ కిల్లా సాక్షిగా సాగుతోంది ఇరుసు, మన ఆత్మగౌరవం కోసం ఈ "బీసీ రాజ్యాధికార"యాత్ర.!

కోట్లాది మంది గొంతుకై నిలబడిన నాయకుడు. ప్రశ్నించే తత్వానికి నిలువెత్తు రూపం.
మన హక్కుల కోసం అహర్నిశలు పోరాడే యోధుడు. బీసీ ఉద్యమ నేత మన తీన్మార్ మల్లన్న
నడుస్తున్నాడు ప్రజా సైనికుడై.!

ఎండనక, వాననక పల్లె పల్లెకు చేరుతూ,
బీసీల బతుకుల్లో వెలుగులు నింపేందుకు,
అధికార పీఠాలపై మన జెండా ఎగరేసేందుకు,
అన్న అడుగులో అడుగు వేసి కదలిరా సోదరా.!

నాగలి పట్టిన చేతులే నవ సమాజాన్ని ఏలాలి. చమటోడ్చిన శ్రమజీవులే శాసనాలు రాయాలి.!
ఎవరికో ఊడిగం చేసే రోజులు పోయాయి.
మన రాజ్యాధికార స్వప్నం నెరవేరే రోజులు వచ్చాయి.!

మల్లన్న పిలుపుతో కదంతొక్కుదాం..
సమసమాజ స్థాపనకై కలిసి నడుద్దాం...

బీసీల సింహాసనమే మన లక్ష్యం..
ఈ పాదయాత్రే మన జైత్రయాత్ర.!

కాసోజు బ్రహ్మచారి
టీఆర్పీ సోషల్ మీడియా
నార్త్ తెలంగాణ కన్వీనర్



## మునిగిపోయిన నౌక..!

**శనార్తి తెలంగాణ, ఢిల్లీ :** ఇండోనేషియాలోని జావా సముద్రంలో ప్రయాణికులతో వెళ్తున్న నౌక ఘోర ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో నౌకలో 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మంది ఉన్నారు. తూర్పు జావాలోని సురబయ నుంచి విర్గో ట్రాన్స్‌పోర్ట్ 8 నౌక శనివారం దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్మాసిన్‌కు బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని కెప్టెన్ తెలిపినట్లు సమాచారం. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నౌకాదళానికి చెందిన నౌకతో సహా నాలుగు నౌకలు, ఒక హెలికాప్టర్, సమీపంలోని టగ్ బోట్ల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా రక్షించగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## శాలియన్ మృతి కేసులో కీలక పరిణామం

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** ప్రముఖ బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2020 జూన్ 8న ముంబైలోని మలాడ్‌లో ఓ భవనం నుంచి కిందపడటంతో దిశా సాలియన్ మృతి చెందారు. తొలుత ఈ ఘటనను ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా ముంబై పోలీసులు నమోదు చేశారు. ఆమెపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారంటూ తండ్రి సతీశ్ సాలియన్ ఆరోపించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరగలేదంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన హైకోర్టు.. దర్యాప్తులోని అంశాలపై మరింత లోతుగా విచారణ అవసరమని పేర్కొంటూ కేసును సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఇక సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే, నటి రియా చక్రవర్తి, మరికొందరి పేర్లను చేర్చింది. ఎఫ్ఐఆర్‌లో పేరు ఉండటం మాత్రమే నిందితులుగా నిర్ధారణ అయినట్లు కాదని, ఆయా వ్యక్తుల పాత్రపై దర్యాప్తు జరగాల్సి ఉందని సీబీఐ స్పష్టం చేసింది. ఆదిత్య ఠాక్రేతో పాటు రియా చక్రవర్తి, డినో మోరియా, సూరజ్ పాంచోలి, రోహన్ రాయ్ తదితరుల పాత్రకు సంబంధించి సీబీఐ వివరాలు సేకరించనుంది. దిశా సాలియన్ మృతికి ముందు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, అప్పటి పోలీసుల దర్యాప్తు, సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను సీబీఐ పరిశీలించనుంది. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగిందన్న ఆరోపణల్లో వాస్తవమెంత, మృతి వెనుక అసలు కారణాలేంటన్న అంశాలపై దర్యాప్తు సాగనుంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కేసులోని అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంపై సీబీఐ దృష్టి సారించనుంది.



## హమ్మయ్య..! బతికిపోయాం..!

**మొదటిపేజీ తరువాయి...**

ఇటీవల రాష్ట్రంలో వర్షపాతం లోటు రైతులను తీవ్రంగా కలవరపెట్టింది. సాధారణంగా ఈ సమయానికి కురవాల్సిన వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో పంటలు నీటి ఎద్దడిని ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. విత్తనాలు వేసిన తర్వాత తొలిదశలో తగినంత వర్షం లేకపోవడంతో మొక్కజొన్న, పత్తి పంటలు ఎదుగుదలలో వెనుకబడ్డాయి. కొన్నిచోట్ల పత్తి మొక్కలు వాడిపోయి పూత, కాయ దశలో నష్టపోయే పరిస్థితి కనిపించింది. మొక్కజొన్న పంటకు కూడా తేమ కొరత ఏర్పడి ఆకులు వాడిపోయాయి. సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో కరెంట్ కోతలు సమస్యగా మారడంతో రైతులు బోర్లపై ఆధారపడలేకపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా కురిసిన భారీ, మోస్తరు వర్షాలు పరిస్థితిని కొంతమేర మార్చాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, వాగుల్లోకి నీరు చేరుతోంది. భూమిలో తేమ శాతం పెరగడంతో వర్షాధార పంటలకు ప్రయోజనం చేకూరుతోంది. ఇప్పటికే పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నష్టం నివారించడం సాధ్యం కాకపోయినా.. ఇంకా కోలుకునే దశలో ఉన్న పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి వంటి పంటలకు కీలకమైన దశలో వర్షం పడటంతో దిగుబడిపై రైతుల ఆశలు కొంత పెరిగాయి. వరి సాగు చేస్తున్న రైతులకు కూడా పొలాల్లో నీటి లభ్యత పెరగడం ఉపశమనం కలిగిస్తోంది. దీంతో ఇన్నాళ్లు వర్షం కోసం ఎదురు చూసిన అన్నదాతలు ప్రస్తుతం కురుస్తున్న వానలను పంటలకు జీవగంజిగా భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. రానున్న రోజుల్లోనూ వర్షాలు కొనసాగితే పంటలు మరింతగా కోలుకునే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. వర్షపాతం లోటును పూర్తిగా భర్తీ చేయాలంటే ఒక్కటి రెండు రోజులు మాత్రమే కాకుండా వరుసగా మరికొన్ని రోజులు వర్షాలు అవసరమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా మెట్ట పంటలకు ఇప్పుడు లభించిన తేమను నిలుపుకోవడం కీలకం. వర్షాలు ఎక్కువగా కురిసే ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో మరిన్ని వానలు కురిస్తే పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆశలు మరింత పెరిగాయి. ఇప్పటికే వర్షం పడిన ప్రాంతాల్లో పొలాలు తడిసి ముద్దవడంతో పంటలకు అవసరమైన తేమ అందుతోంది. ఎండిపోతున్న పత్తి చేన్లు, వాడిపోతున్న మొక్కజొన్న, కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్న వరి పంటలకు ఈ వర్షాలు సకాలంలో వచ్చిన ఊరటగా మారాయి. పంటల పరిస్థితి పూర్తిగా మెరుగుపడాలంటే రానున్న వర్షాలే కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే అన్నదాతలు మరికొన్ని రోజుల తర్వాత వానలు పడడంపైనే గంపెడాశలు పెట్టుకున్నారు. అందుకే రెండు రోజుల వరుణదేవుడి కరుణకు ధన్యవాదాలు చెబుతూనే... మరికొద్ది రోజుల్లోనే మరోసారి వర్షాలు పడాలని కోరుతున్నారు.



## దళితులకు కేసీఆర్ అన్యాయం

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ దళితులు నడిచిన నేలను శుద్ధి చేసిన బీఆర్ఎస్ నేతలపై మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ''నేలను కాదు.. మీ బుర్రను శుద్ధి చేయాలి'' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని ఆరోపించారు. దళిత సమాజం ఆయన్ను ఎప్పటికీ క్షమించదన్నారు. ఓట్ల కోసమే కేసీఆర్ దళిత కార్డును ఉపయోగించారని విమర్శించారు. దళితుల కోసం బీఆర్ఎస్ 2003లో రూపొందించిన డాక్యుమెంట్‌ను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.
దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు పథకాలను ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా ఆయన సూచనలను పాటించాలని హితవు పలికారు. దళితుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు బీసీ నేతకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రతిపక్ష నేతగా చేయాలని సవాల్ విసిరారు. కేసీఆర్ ఎలాగూ అసెంబ్లీకి రావడం లేదని, తలసానికి ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ నేతకు ఆ హోదా ఇస్తే సస్పెన్షన్ ఎత్తివేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడిన మాటలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

## అంబర్‌పేట శంకర్‌కు షాక్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** అంబర్‌పేట శంకర్‌కు పోలీసులు షాక్ ఇచ్చారు. ఆయనపై మళ్లీ రౌడీషీట్ రీ ఓపెన్ చేశారు. జూబ్లీహిల్స్, మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధుల్లో అంబర్‌పేట శంకర్ బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మరోసారి అతడిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. 2019 వరకు శంకర్‌పై రౌడీషీట్ ఉండేది. అప్పట్లో ఆయనపై ఉన్న షీట్‌ను పోలీసులు మూసేశారు. అప్పటి నుంచి కొంతకాలం వరకు అంబర్‌పేట శంకర్‌పై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. ఇటీవల జూబ్లీహిల్స్, మేడిపల్లి పీఎస్ లిమిట్స్‌లో బెదిరింపులకు దిగినట్లు శంకర్‌పై రెండు కేసులు బుక్ అయ్యాయి. జూన్ నెలలో గాజులరామారం ప్రాంతంలో బిల్డర్‌కు తెలియకుండా ప్లాట్లు అమ్మడంతో అంబర్‌పేట శంకర్‌పై కేసు నమోదైంది. అంతేకాక గతంలో ఓ న్యూస్ ఛానల్ నిర్వాహకులు, ఓ వ్యక్తి మధ్యవర్తిగా ఉండటంతో శంకర్‌పై మరో కేసు బుక్ అయ్యింది. ఈ రెండు కేసుల ఆధారంగా ఆయనపై గతంలో మూసేసిన హిస్టరీ షీట్‌ను పోలీసులు రీ ఓపెన్ చేశారు.






## టీఆర్పీలో భారీ చేరికలు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యాలయంలో మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ ఆధ్వర్యంలో సోమవారం జనగాం జిల్లాకు చెందిన పలువురు యువకులు, మైనార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు మైనార్టీల హక్కులు, అభివృద్ధి, రాజకీయ భాగస్వామ్యం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ అని అన్నారు. మైనార్టీ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత బలోపేతం కావాలంటే వారికి నిర్ణయాత్మక స్థాయిలో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.
అనంతరం జనగామ జిల్లాకు చెందిన అఫ్సర్ పాషాను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ మల్లన్న నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మైనారిటీలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగడం లేదని, రాష్ట్రంలో కేవలం రెడ్డి,వెలమ వర్గాలకే ప్రయోజనాలు చేకూరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కోసం నిజాయితీగా పోరాడుతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ పట్ల విశ్వాసంతోనే తాము పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్,స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్,రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్,జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

### పెద్దంపల్లి గ్రామం నుంచి చేరికలు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామం నుండి పెద్ద ఎత్తున యువత తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. పెద్దంపల్లి గ్రామ 8వ వార్డు మెంబర్ అంబటి కార్తీక్తో పాటు పలువురు యువకులు పార్టీలో చేరగా, వారికి టీఆర్పీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రబాటి హరీష్, వజ్జీరు కిరణ్, చలుకాని సైలని, బాబా, సిద్దార్థ తదితరులకు హృదయపూర్వక స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు ప్రణయ్ రాజ్, క్రమశిక్షణ కమిటీ సభ్యులు కరుణాకర్, జిల్లా కోశాధికారి శ్రీను, భూపాలపల్లి మండల అధ్యక్షుడు రాజు, చంద్రశేఖర్, రాంబాబు, శ్రీకాంత్, దేవేందర్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.


## కొలువుదీరిన గణపయ్య

**మొదటిపేజీ తరువాయి...**

గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతున్నాయి. ప్రధానంగా ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి వేలాదిగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ, పోలీస్ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. ఒకవైపు ఆధ్యాత్మిక ఉత్సవాల సందడి కొనసాగుతుండగా, మరోవైపు కొన్ని మండపాల వద్ద మితిమీరుతున్న డీజేల శబ్దాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భక్తి ముసుగులో విపరీతమైన శబ్ద కాలుష్యానికి తెరతీస్తూ, యువత డ్యాన్సుల పేరుతో హద్దులు దాటుతున్నారు. అధిక సౌండ్ వల్ల గుండె బాధితులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డీజేల బేస్ శబ్దాలకు భయపడి పసిపిల్లలు, చిన్న పిల్లలు అల్లాడిపోతున్నారు.
ఇటీవలి హైదరాబాద్ రామ్‌నగర్ ప్రాంతంలో వినాయక ఆగమనం ఊరేగింపులో భారీ డీజే శబ్దాలు, బాణసంచా కాల్పుల నడుమ తీవ్ర గందరగోళం, తోపులాట, తొక్కిసలాట జరిగి ఓ యువకుడు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. డీజే శబ్దాలు, రద్దీ ఒత్తిడి వల్లే ఈ ఘోరం జరిగిందని ఆ కుటుంబ సభ్యులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నడుమ వినాయక మండపాల వద్ద ఎవరైనా.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా ఘటనలపై స్పందించిన పోలీస్ ఉన్నతాధికారులు ఉత్సవ నిర్వాహకులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. "రాత్రి 10 గంటల తర్వాత మైకులు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించకూడదు. అనుమతించిన డెసిబెల్ స్థాయికి మించి సౌండ్ పెంచితే సౌండ్ సిస్టమ్‌లు, డీజే వాహనాలను సీజ్ చేస్తాం" అని హెచ్చరించారు. మైదాన ప్రాంతాల్లో, మండపాల వద్ద సౌండ్ స్థాయిలను కొలిచేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.
మార్గదర్శకాల ఉల్లంఘనపై చర్యలు తప్పవని.. తోపులాటలు, తొక్కిసలాటలకు తావులేకుండా రద్దీని క్రమబద్ధీకరించాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పండుగలు ఆనందాన్ని, ప్రశాంతతను పంచాలి తప్ప ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని, ప్రజలంతా భక్తిభావంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బంగ్లాను వణికిస్తున్న తట్టు

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్‌ను తట్టు వణికిస్తోంది. తట్టు వ్యాప్తి ఆ దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ఏడాది మార్చి 15 నుంచి సెప్టెంబర్ 13 వరకు దేశవ్యాప్తంగా 1,71,543 అనుమానిత తట్టు కేసులు నమోదు కావడం గమనార్హం. వీటిలో 20,069 కేసులు ల్యాబొరేటరీ పరీక్షల్లో తట్టు వ్యాధిగానే నిర్ధారణ అయ్యాయి. తట్టు లక్షణాలతో ఇప్పటికే దేశవ్యాప్తంగా 1,51,024 మంది ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో 1,45,252 మంది చికిత్స అనంతరం కోలుకుని డిశ్చార్జ్ కాగా, 1,022 మంది మృతి చెందారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో తట్టు వేగంగా వ్యాప్తి జరగడంపై ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. చిన్నారుల్లో వ్యాధి ప్రభావం అధికంగా కనిపిస్తుండటంతో ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో తట్టు కేసులు పెరుగుతుండటంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. చిన్నారులకు అందాల్సిన తట్టు టీకాల్లో ఏర్పడిన అంతరాలు, రోగనిరోధక శక్తి లోపం కారణంగా వ్యాధి వ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు తెలిపింది. ముఖ్యంగా టీకాలు తీసుకోని, పూర్తి టీకాలు వేసుకోని చిన్నారుల్లో ఇన్ఫెక్షన్ ముప్పు ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది. తట్టు వ్యాప్తిని అడ్డుకునేందుకు టీకా కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు అనుమానిత కేసులను త్వరగా గుర్తించి చికిత్స అందించాలని సూచించింది. తట్టు వేగంగా వ్యాప్తి చెందే వైరల్ వ్యాధి కావడంతో కేసుల గుర్తింపు, పర్యవేక్షణ, చికిత్స, టీకాల కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ఇప్పటికే భారీగా వ్యాధిగ్రస్తులు ఆసుపత్రుల్లో చేరడం, మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో వ్యాధి నియంత్రణకు అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.



## మూసీకి వరద ఉధృతి

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూసీ రిజర్వాయర్‌కు వరద నీటి ప్రవాహం గణనీయంగా పెరుగుతోంది. మూసి రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 645 అడుగులు ఉండగా, ప్రస్తుత నీటిమట్టం 638.30 అడుగులకు చేరింది. పూర్తి సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద ఉధృతి పెరుగుతుండటంతో.. వరద తీవ్రత దృష్ట్యా రెండు జిల్లాల్లోని మూసీ పరివాహక మండలాల ప్రజలను అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు. సూర్యాపేట, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలోని రత్నాపురం, రామవరం, హనుమాన్ తండా, వెంకట్రాంపూర్, టేకుమట్ల, నంద్యాలగూడెం, కాసరాబాద్, దోసపహాడ్, మూసీ ఒడ్డు సింగారం, సజ్జాపురం, శూన్యపహాడ్ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నల్గొండ జిల్లాలోని కేతేపల్లి, మాడుగులపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల మండలాల్లోని బొప్పారం, చీకటిగూడెం, భీమారం, అమనగల్, రావులపెంట, తక్కెళ్లపాడు, ములకల కాల్వ, వాడపల్లి, వజీరాబాద్ తదితర గ్రామాల స్థానికులను హెచ్చరించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగితే వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, గత 24 గంటల్లో రిజర్వాయర్‌కు 5,200 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. అధికారులు తెలిపారు.
నదితో పాటు వాగులు, కాలువలు, లోతట్టు ప్రాంతాలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరూ అటువైపు వెళ్లవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా చేపల వేటకు వెళ్లేవారు, వ్యవసాయ పనుల నిమిత్తం నది తీరానికి వెళ్లే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు వహించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఇచ్చే ఆదేశాలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.